# చీకటిలో వెలుగు

---

ప్పోలీసుఠాణాలో గడియారం ఠంగ్ ఠంగ్‌మని వరుసగా నాలు గ్గంటలు కొట్టి వూరుకుంది. ఎదురింటి డాబామీద శర్మగారు పక్క-పై లేచి కూర్చున్నారు. రోజూ అ గంటలశబ్దం ఆయనకి పెట్టని అలారం, అలవాటు చొప్పున హుషారుగానే లేచిపోయారు. నిజానికి రోజుకన్న, ఆ రోజు ఉత్సాహపు పాలు కాస్త జాస్తిగానే వుంది. దానికి కారణం కూడా లేకపోలేదు మరి.

ఒక్క-సారిగా ఏమయిందో మరి, గుండెలపై రాసుకొంటూ "నారాయణ....నారాయణ" అనుకోసాగేరు. ఎడం పక్క-లో ఏదో బాధ కలుక్కు-మన్నాది. అదివరలో కూడ అది ఎప్పుడో తన్ను పరామర్శించి నట్లు జ్ఞాపకం వచ్చింది ఆయనకి. లేచి కూర్చున్న పక్క-మీదనే తిరిగి నడుం వాల్చేరు. మరి నాలుగుసార్లు నారాయణ నామస్మరణ చేసు కొన్నారు.

అరగంటకల్లా అర్ధాంగి పిలుపు విన్పించింది. "ఇంకా లేవనేలేదు టండీ! వాకిట్లో పాలవాడు అరుస్తున్నాడు" అంటూ.

"ఈ రోజు కాస్త బద్ధకంగా వుంటే అలా కన్నుమూసేను. ఇదిగో వస్తున్నా" అంటూ పంచ సవరించుకొంటూ మెట్లు దిగసాగేరు పక్క-నున్న పిట్టగోడ ఆసరాతో "చూడండి బాబూ.... చెంబు చూడండి" అంటూ గంగులు చెంబుని అతినేర్పుగా గిరికీలు కొట్టించేడు. "వెధవ

నేర్పా పీడూను అధమం అర్ధపావు పీళ్ళయినా అడుగున వుంటాయి."
అన్నాడు అప్పుడే పళుదోముపుల్ల నోట్లో పెట్టుకొని, వీధి అరుగుమీది కొచ్చిన శర్మగారి పెద్దబ్బాయి సాంబశివం.

"జుయ్ జుయ్" మనే శబ్దంతో చెంబు నిండింది. కోడలు రాజ్య లక్ష్మి వచ్చి పాలు గిన్నెలో కొ౯పించుకొని వెళ్ళింది; సాంబశివం దంత ధావన కార్యక్రమం పూర్తిచేసి, పై మీది తువ్వాలుతో ముఖం తుడుచు కొంటూ లోపలికి వెళ్ళేడు.

వెనుదిరిగి వెళ్తున్న కొడుకుతో, "సాంబూ! ఈ రోజు మీతో పాటు నాక్కూడా కాస్త కాఫీచుక్క ఇయ్యమని కోడలు పిలతో చెప్పు అన్నారు శర్మగారు "ఏం నాన్నా! వంట్లో సరిగా వుందా?" ఆతృతగా ప్రశ్నించేడు సాంబశివం.

ఆయన జీవితంలో కాఫీతాగిన సమయాలే అరుదు. అందులో స్నానం, ధ్యానం లేకుండా తాగడం అన్న ప్రశ్నేలేదు.

"అబ్బే....అబ్బే....అలాటి చికాకేం లేదురా. ఎందుకో కాస్త తాగాలనిపించిందంతే" అన్నారు.

తండ్రిలో వస్తున్న ఈ మార్పులకి తనలో తనే నవ్వుకొన్నాడు సాంబశివం. ఈ మధ్య నాన్నకేమిటి ఇలాటికోర్కెలు పుడ్తున్నాయి. అను కొన్నాడు.

పది నిశ షాలకల్లా కంచుగ్లాసుతో కాఫీ పట్టుకొచ్చింది కోడలు పిల్ల. కనుచీకటి సమయంలో "మామయ్యా కాఫీ తీసుకోండి" అనిందికే ఆ పిల్ల మొగమాటపడ్డాది. ఏనాడూ లేని అలవాటాయెను. అందులోను భర్త తిన్నగా వినిపించుకొన్నాడో, లేదో అన్న అనుమానం ఒకమూల. తీరా....ఇదేమిటమ్మా! వాడు అంటేమాత్రం అ మాత్రం నీకు తెలియదూ! నువ్వు ఈ ఇంట కాలాపెట్టేక ఎప్పుడైనా ఇలా జరగడం చూసేవా?"
అని మామగారు నిలదీస్తే....?

ఏమాటా అనలేక సన్నగా దగ్గింది. శర్మగారు అటు తిరిగిచూసి "అమ్మ.... అమ్మ...." అంటూనే పూర్తి చెయ్యలేకపోయారు.

రాజ్యలక్ష్మి గ్లాసు కిందపెట్టి వెళ్ళింది. ఆమె వెళ్ళినసంగతి రూఢీ చేసుకొన్న తరువాతనే శర్మగారు కాఫీగ్లాసువైపు చూసేరు గ్లాసులోనుండి వేడికాఫీ పొగలు కక్కుతున్నాది! వెచ్చవెచ్చని కాఫీ పెదిమల తాకుతుంటే ఆయనకి ఏదో క్రొత్తగా అనిపించింది. వంట్లోలేని ఉత్సాహం పుటుకొచ్చింది. తను మొదటిసారి కాఫీతాగినరోజు జ్ఞాపకం వచ్చింది. ఆ తప్పును కప్పుకొందికి తను తండ్రిముందు పడ్తున్న అవస్థను చూసి, భార్యామణి నవ్విన నవ్వులు, పరిహాసాలు మనసులో కదిలేయి. గడచిపోయిన కాలాన్ని కాలితో ఒక్క తన్ను ముందుకితన్ని, తను వెనక్కి నడిచిపోయినట్లనిపించింది శర్మగారికి.

ఈ కాఫీలో ఇంత ఉత్సాహాన్నిచ్చే శక్తి ఉన్నదని తెలుస్తే రోజూ తాగేవాడినే, అని నవ్వుకొన్నారు.

కాని ఆయనకి ఆ ఉత్సాహాన్ని కలుగజేసింది కాఫీకాదు. బాల్యం నుండి మనసులో గుప్తంగా పెంచుకొస్తున్న కోరిక అనాడు సఫలం కాబోతున్నది. బహుశ ఆ సంగతి ఇంట్లో అందరికీ తెలుసేమో మరి. కాని ఎవ్వరూ అమాట ఎత్తనేలేదు. తనంతట తానుగా చెవ్పకొందికి ఆయన సిగ్గుపడ్డారు, కాదూ? మరి, ఏ వయస్సుకా ముచ్చట కాని: అరవయ్యో పడిలో "అ—ఆ"లు నేర్చుకొన్నట్లు, ఇప్పుడు నాకు చదువేమిటి అనుకొన్నారు.

కాని ఎంత దాచుకొందామనుకొన్నా ఆ ఆలోచన ఆయనలో ఉబుకుతుంటున్నది. ఎవరితోనో ఒకరితో చెప్పెయ్యాలి మరి. స్నానం, ధ్యానం జరుగుతున్నంతసేపు అందుకు అర్హమైన వ్యక్తికోసం అన్వేషణ జరుగుతూనే వుంది.

ఈలోగా పదిసార్లయినా వీధిగుమ్మంవైపు చూసేరు రోజూ ఆరు గంటలకే తగలడే పేపరు కుర్రాడు ఆరోజు ఇంకా రాలేదు అందరికీ తెలిసిన విషయం వాడికిమాత్రం తెలియకుండా వుంటుందా? వాడిక లెగ్గొట్టి పై నమ్ముకొంటే, గిరాకీని బట్టి సొమ్ములాగొచ్చనుకొని వుంటాడు! ఏం.... డబ్బు చేదా ఎవరికైనా?

అయినా ఆ కొనేవాళ్ళకయినా బుద్ధుండాలి. "అక్రమ ధరలని అదుపులో పెట్టండి. నల్లబజారులో ఏవస్తువా కొనకండి" అని మన నాయకులు గొంతులు చించుకొని అరిచినా ప్రయోజన మేమిటి? సాగే వ్యాపారాలు సాగిపోతూనే వున్నాయి. లాభాలు పొందేవారు పొందుతూనే వున్నారు. అయనా ఏమిటో అనుకోవడమే కాని అవుసరం అందరిచేతా అలా చేయిస్తుంది.

ఇంకోగంట పేపరువాడు రాకపోతే తను పదిపైసలు ఎక్కువిచ్చి పేపరు కొనిందుకైనా తయారుగాలేడా? అందరి అవస్థ అలాటిదే:అని నవ్వుకున్నారు శర్మగారు.

అరగంటై అరుగుమీద వాలుకుర్చీలో కూర్చుని, కళ్ళపై పడుతున్న ఎండకి చెయ్యడ్డం పెట్టుకొని, వీధిచివరదాకా చూస్తూనే వున్నారు. తాణాలో ఎనిమిదిగంటలు కొట్టేరు. ఇంక ఈ రోజుకి పేపరువాడు రానట్లే. బజారుకిపోయి కొనుక్కోడం మినహా గత్యంతరం లేదు, అనుకొన్నారు.

కుర్చీలోంచి లేవబోతుంటే ఉదయం పలుకరించిపోయిన నొప్పి మళ్ళా కనిపించింది. రెండు నిముషాలపాటు కళ్ళు - మూసుకున్నారు. తగిన ఆదరణ జరుగలేదన్న కారణంగా ముఖం ముడుచుకు వెళ్ళిపోయింది ఆ నొప్పి.

"తాతయ్యా! ఇవాళ నీపరీచ్ఛ లొత్తాయిట "అంటూ లోపలినుండి

అరుస్తూ వచ్చింది మనుమరాలు మల్లిక. "ఆహా అల్లాగా నేను మరచే పోయేనుసుమా; ఎవరుచెప్పేరు నా చిట్టితల్లికి?" అన్నారు శర్మగారు మనుమరాలిని దగ్గరకు తీసుకొంటూ.

ముందురోజు పేపర్లో "మెట్రిక్యులేషన్ పరీక్ష ఫలితాలు రేపు ప్రకటింపబడును" అన్నవార్త చదివిన దగ్గరినుండి అదే అతనికి రామనామం అయిపోయింది. కాని చిన్న పిల్లడిలా ఆతృత ఎలా చూపగలరు? మనసులో వుత్సాహాన్ని మనసులోనే దాచుకొన్నారు. అక్కడికీ చాటుగా రెండు, మూడుసార్లు చేతిలో, నాణెంతో, బొమ్మబొరుసు వేసుకొని చూసుకొన్నారు.

ఒకసారి పరీక్ష పాసవుతుందనీ, మరోసారి పోతుందనీ పద్దాదిముత్యం మూడుసార్లు అనుకొన్నారు చిన్న పిల్లాడిలా మూడోసారి నాణెం ఎగురవేస్తూ. మూడోసారి "పాసు" అనే పడ్డాది.

"మరింకేం శర్మా! నువ్వూ మెట్రుక్యులేటువి కాబోతున్నావు" అని తనని తనే అభినందించుకొన్నారు. తన పసిబుద్ధికి తనలోతను నవ్వుకొంటుండగానే, వరండాలో చిట్టి, పొట్టి అడుగులచప్పుడు వినిపించింది. చేతిలో అయిదుపైసల నాణేన్ని చల్లగా జేబులో జార్చి తాతయ్య ముఖం పెట్టేరు. "తాతయ్యా! తాతయ్యా! నాన్నమ్మ బువ్వకి రమ్మంటున్నాది" ఏడేళ్ళ మల్లిక, నాలుగేళ్ళ బుచ్చి, తాతగారి చెరోచెయ్యి పట్టుకొని ఊగులాడేరు

"ఏంటి తాతయ్యా! పొద్దున్నే బుచ్చిగాడిలా బొజ్జుంటున్నావా? మనుమరాలి మాటతో ఆలోచనలకి ఆనకట్టపడింది. "అబ్బే.... అబ్బే లేదమ్మా! నీకీమాట ఎవరుచెప్పేరా అని ఆలోచిస్తున్నాను." అన్నారు.

"అమ్మ చెప్పింది తాతయ్యా! మరేమో నాన్నార్ని పేపరుకొనితెమ్మంది.... మరేమో తాతయ్య నువ్వు పరీక్షపాసవుతే నాకేమిత్తావు తాతయ్యా!" అన్నాది మల్లిక తాతగారి పిలకని విప్పి ముడివేస్తూ.

"నువ్వేది కావాలంటే, అది. మరి ఏం కావాలో చెప్పు చూద్దాం" అన్నారు శర్మగారు మనుమరాలిబుగ్గల్ని ముద్దుపెట్టుకొంటూ. "మరి.... నీ పొడుంకాయ కావాలి తాతయ్యా" అన్నది మల్లిక వుత్సాహంగా.

"పొడుంకాయ ఏం చేస్తావమ్మా. మల్లీ!" అన్నారు శర్మగారు.

"మరేమో తాతయ్యా! నీ పొడుంకాయేమో .... ఎంచక్కా...." మాట పూర్తి చెయ్యలేకపోయింది మల్లిక.

తాతయ్య పొడుంకాయ తీసేసరికి, ఎక్కడున్నా పరుగు-పరుగున వస్తారు మల్లిక చిట్టిబాబు. దాని అవుసరం పూర్తయి తాతయ్య దాన్ని మొల్లో దోపుకొనేదాకా చూపు తిప్పకుండా చూస్తారు. అంచక్కా....నాకే అలాటి పొడుంకాయ వుంటేనా? అని ముచ్చటపడేది మల్లిక.

తీరా ఇప్పుడు తాతయ్య పొడుంకాయతో ఏమిటి చేస్తావమ్మా అని అడుగుతే, అది తనకెందుకో నిజంగా అర్థంకాక .... అయోమయంగా చూసింది. చివరికి ఏదో మాట పూర్తి చెయ్యాలన్నట్లు "ఎంతో బాగుంటుంది తాతయ్యా" అన్నాది ఇంకేం చెప్పలేక.

అప్పుడే గడపలో కొచ్చిన సాంబశివం "నాన్నా! నేను బజారు కెళ్తున్నాను. మీకేమయినా కావాలా?" అని ప్రశ్నించేడు. పేపరు తెమ్మని చెప్పాలనుకొన్న శర్మగారు ఆ మాటని నాలుక చివరనే ఆపుకొన్నారు. నిన్న వాడుకూడా చూసేడుకదా? పైగా పోతున్నది నలుగురు మనుషులు నడియాడే బజారుకే కాని అడవిలోకి కాదుకదా? అందరూ అనుకొంటుంటే వాడే చూస్తాడు; అనుకొన్నారు.

తండ్రి ముఖంలో క్షణకాలం వెలిగి, ఆరిన ఆతృతకి చిన్నగా నవ్వుకొన్నాడు సాంబశివం. తండ్రి నోటితో చెప్పకపోయినా, దానిభావం కొడుక్కి తెలుసు.

"ఈలోజు పేపరు రాలేదు కదా; బజార్లో దొరుకుతుందేమో చూస్తాను. మీ పరీక్ష ఫలితాలు........"

"అ....మరే....మరే—" కొడుకుమాటని పూర్తి చెయ్యనివ్వ లేదు శర్మగారు. ఆ మాటని తనలో తను వెయ్యిసార్లను – కొందికైనా అతనికి సంతోషమే, కాని ఎదుటి వారంటుంటేమాత్రం ఏదోగా అని పిస్తుంది.

"నాన్నా!....నాన్నా! నేనూ వస్తాను నాన్నా!" మల్లిక తండ్రివెంట పరుగుతీసింది.

కొడుకు, మనుమరాలు వీధి చివరకి వెళ్ళేదాకా అలే చూసేరు శర్మగారు. ఎండ సూటిగా కళ్ళలో పడసాగింది. అలాగే కళ్ళు మూసు కొని కుర్చీలో చేరపడ్డారు. అతనికి తన చిన్నతనపు రోజులు జ్ఞాపకం రాసాగేయి.

పసితనం దున్ని పదునుచేసిన సారవంతమైన భూమివంటిది. అందులో ఏవిత్తుపడినా లోతుగా నాటుకుంటుంది. తగిన దోహదక్రియ సకాలంలో లభిస్తే ఆ మొలక ఆకులు పువ్వులతో విస్తరించి ఫలితాన్ని అందిస్తుంది. లేకపోయినా విత్తునాశనం కాదు. ఇక్కడా అక్కడా ఒకటీ, అరా వేళ్ళు నాటుకొని అవకాశంకోసం ఎదురుచూస్తుంటుంది ఒక చిన్న వాన జల్లు, చెంబుడు చల్లని నీళ్ళు దానికి ప్రాణం పోస్తాయి.

పాశ్చాత్య విద్య అభ్యసించాలన్న కోరిక శర్మగారికి అటువంటి వయసులోనే కలిగింది, కాని దానికి తండ్రిగారి అనుకూలత అనే దోహద క్రియ జరుగక పోవుటచే అది మొలకెత్తి పైకిరాలేదు. తన చెలికాడు, పినతండ్రి కొడుకు అయిన శేఖరం హైస్కూలు చదువుకని పట్నం పోయిననాడు తనకీచదువు కావాలనే శర్మగారి కోర్కెకు ఒకటి, రెండు వేళ్ళు లేచాయి. ఒకటి, రెండు సందర్భాలలో తన అభీష్టాన్ని తండ్రి గారికి తెలియజేసేరు.

"ఈ పాశ్చాత్య విద్యలు, ఉద్యోగాలు చేసుకొంటూ ఆ డబ్బుతో పొట్టపోసుకోవాలనుకొనేవారికి అటువంటి అక్కర రాదనే నా అభిప్రాయం. ఇంతకి నువ్వు నేరుస్తున్న విద్య దాని కేమాత్రం తక్కువయినది కాదు" అని తండ్రిగారు నచ్చచెప్పడంవల్ల నమ్మిక కల్గింది.

తండ్రిగారి అభిప్రాయం సరియైనదనికూడా అనిపించింది. అటు తరవాత శర్మగారు ఆ విషయం మరచిపోయేరనే చెప్పవచ్చు.

కాలగతిని శర్మగారి తల్లిదండ్రులు పరలోకవాసులయేరు. మిగిలింది భార్యా పిల్లలు, తను. కూటికి, గుడ్డకి లోటులేని సంసారం కావడం వల్ల, ఎటువంటి ఒడిదుడుకులు లేకుండానే జీవితం సాగిపోసాగింది. తాను నేర్చిన భాషాభిరుచికి మెరుగులు దిద్దుకుంటూ, ప్రశాంతంగా కాలం గడుపసాగేరు.

నిశ్చలమైన నీటిలోకి ఎవరో బెడ్డని విసిరినట్లు వచ్చి పడింది, శర్మగారిలాంటి భూస్వాములను హడలగొట్టే జమీందారీ ఇనాముల రద్దు బిల్లు. శర్మగారి తాత, ముత్తాతలు పదిమంది ఎదుట తమ పాండిత్య ప్రతిభ చూపి సంపాదించిన ఇనాము భూములన్నీ ఒక్క కలంపోటుతో ఎగిరిపోయేయి. మిగిలిన కాస్తభూమి నలుగురు పొట్టలు నింపేటంత చేవగలది కాదు. అయోమయంగా ఆసరాకోసం ఇటు, అటు చూసేరు శర్మగారు. సహృదయుడైన ఒక స్నేహితుని సహాయంతో ఒక హైస్కూల్లో తెలుగుమాస్టరు పదవి పొందగల్గేరు.

పుట్టి పెరిగిన ఊరుని, అనుసరిస్తున్న అలవాట్లని వదలి, భార్యా బిడ్డలతో పట్నం చేరుకొన్నారు శర్మగారు. జీవితం సాగిపోతున్నా, ఏదో వెలితి కొట్టవచ్చినట్లు కన్పించేది అతనికి. తను గౌరవించి అభ్యసించిన విద్యపట్ల విద్యార్థులు చూపే అనాదరణ కొంతవరకు దానికి కారణం. తెలుగుకూడా ఒక భాషేనా? దానికి బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు కూడా అవసరమా? అన్నట్లు ప్రవర్తించేవారు విద్యార్థులు,

మాతృభాషపట్ల ఇంత నిర్లక్ష్యం చూపుతూ, వెంటబడి పరుగులు తీస్తున్న ఆ అంగ్లభాషయొక్క అధిక్యత ఏమిటో తెలుసుకొంటే బాగుండుననిపించేది శర్మగారికి. కనీసం అతను మెట్రిక్యులేషన్ అయినా పాసయి వుంటే ఆ భాషలోని గొప్పదనాన్ని లీలగా అయినా దర్శించే అవకాశం వుండేది.

కాని ఏనాటికి ఆ గుప్పిట విడనేలేదు.అందులోని వస్తువును చూడ గలిగే పరిజ్ఞానం శర్మగారికి రానేలేదు. కొడుకులు ఇంతలేసి ఇంగ్లీషు పుస్తకాలు ముందేసుకొని చదువుకొంటుంటే, ఆ పుస్తకాలవంక ఆశగా చూసేవారు. ఆ అక్షరాలవెనుక దాగున్న పదలాలిత్యాన్ని, భావనా బలిమిని తెలుసుకోవాలని తహతహలాడేవారు. ఖండాంతరాలు దాటి మనదేశంలోకొచ్చిన ఈ భాష మానవజాతి కందిస్తున్న మహోత్కృష్ట సందేశం ఏమిటా? అని ఆలోచించేవారు. అన్ని ప్రశ్నలకి సమాధానంగా అర్థం తెలియని అక్షరాలు రకరకాల విన్యాసాలతో ఆయన కళ్ళముందు తిరుగులాడేవి.

పిల్లల లెక్కల పుస్తకాలని చూసినప్పుడల్లా ఆ గీతలు, ఆ సొంజ్ఞలు తనకి తెలియని ఏవో విలువలని చెప్పుకుపోతున్నట్లు అనిపించేది. ఆనాడు ఈ విద్యపట్ల తనకు కలిగిన అభిరుచిని తండ్రికి మరికాస్త స్పష్టంగా తెలియజేసి వుండవలసింది. తన కోర్కెని ఆయన కాదనకపోయేవారు. కాని ఆనాడు అది జరుగలేదు. ఈనాడు యిది తీరేమార్గంలేదు. ఇంతవయస్సు వచ్చేక ఇప్పుడు చదువుకొంటే నలుగురు నవ్వుతారు. కాని తనలో ఇంతలోతుగా నాటుకొన్న ఈ కోర్కె తీర కుండానే వుండిపోతుందంటే బాధగానే వుంది. అధమం మెట్రిక్యు లేషన్ అయినా పాసయివుంటే బాగుండును; అని ఆశలని చంపుకోలేక పెంపుకోలేక సతమత మయేవారు శర్మగారు.

కాలం తనదారిని తాను నడచిపోసాగింది. శర్మగారి మనసులో ఆ కోర్కెపై నివురు కప్పింది కాని, ఒక చిన్నగాలిరివట ఆ నివురిని ఎగరగొట్టి నిప్పుని ప్రకాశింపజేసింది

"తెలుగు మాష్టర్లంతా కనీసం మెట్రిక్యులేషన్ అయినా పాసు కావాలనీ, లేకపోతే జీతంలో ఇంక్రిమెంట్లు రావని" పత్రికలో పడిన ఒక వార్తతో ఆ నిప్పు మరల రాజుకొంది శర్మగారిలో సంతోషం పొంగి పొర్లింది ఇప్పుడు తను చదువుకొన్నా ఎవరూ ఆక్షేపించరు. ఉద్యోగంకోసమే చదువుతున్నా ననుకొంటారు అని సంతృప్తి పడ్డారు. ఈ వయసులో మీకు చదువేమిటి నాన్నా ఇంక్రిమెంట్లు రాకపోతే మునిగిపోయిందేమీలేదు. అసలు ఈ ఉద్యోగం చెయ్యకపోయినా వచ్చిన నష్టం ఏంలేదు. మేమంతా పెద్దవారమయేము. ఆమాత్రం సంసారం నడుపుకోలేమా? మీరింక "కృష్ణా, రామా" అంటూ కాలం గడిపేయండి" అన్నాడు పెద్దకొడుకు సాంబశివం.

"ఇప్పుడు ఈ లెక్కలు. ఇంగ్లీషు చదువుకొని మీరే పాసవుతారు నాన్నా! కష్టం" అన్నాడు చిన్నకొడుకు.

"అదేం మాటరా, మనిషి నంటూ వున్నతరువాత పనిపాట్లు మాని ఎలా కూర్చుంటాను? ఈ కాలంలో ఎంతసొమ్ము తెచ్చుకొంటున్నా బొటాబొటిగానే బ్రతుకులు గడుస్తున్నప్పుడు, రావలసిన ఇంక్రిమెంట్లని వదులుకోవడం ఏం బాగుంటుంది? ఎంత ముసిలివాడినైనా, కావాలని కష్టపడి చదివితే ఆమాత్రం పాసుమార్కులు రాకపోతాయా?" అని కొడుకుల మాటలవి గాలిలో కెగురగొట్టారు శర్మగారు.

తండ్రిలో వున్న ఈ కోర్కె ఈ నాటిది కాదని, కాకపోతే ఈ వార్త ఒక సాకుగా దొరికిందని పిల్లలకి తెలుసు. అందుకే అంత తన్న చెప్పలేకపోయేరు.

ఆనాటినుండి కొడుకులు కోడలు, కూతురు, అంతా శర్మగారికి జేచర్లే. "శేషూ! యీ లెక్క ఎలా చేస్తారే? అమ్మా! రాజ్యలక్ష్మి యీ స్పెల్లింగు సరిగావుందా? ఒరే బాబూ! కాస్త ఈ గ్రావు ఎలాగియ్యాలో చెప్పిపెట్టరా" అని ఒకటే హంగామా చేస్తుండేవారు.

ఈ వృద్ధుని విద్యాభిలాషికి ఇంట్లో అందరూ ఆశ్చర్యపడేవారు. ఆశ్చర్యానికి మరికా స్త హాస్యం జోడించి పరిహసించేవారు. పైవారుకూడా "తాతగారూ! చదువు బాగా సాగుతున్నదా? మీ దీక్ష చూస్తుంటే యీ సంవత్సరం యూనివర్శిటీ ఫస్టు మీరే కొట్టేశేలా వుంది" అనేవారు.

శర్మగారి బుర్రలో ఇలాంటి మాటలు జొరబడేందుకు స్థానం ఏది? అదంతా ఇంగ్లీషు, లెక్కలు, జాగ్రఫీ హిస్టరీవంటి విద్యా విష యాలతో నిండిపోయింది. తన లక్ష్యం చేరుకొందికి అమితోత్సాహంతో పరుగులుతీసేవారు.

అంతకాలం చేసిన పరిశ్రమకి ఫలితం అందుకొనే రోజు వచ్చిం దంటే అది అన్ని రోజుల లాటిదీనా? అందుకే ఆరోజు ఆతనిలో ఉత్సాహం పరవళ్ళు తొక్కుతున్నాది. "ఏనాటికల ఇది! ఈనాటికి తీరబో తున్నది" అనుకొని సంతోషించేరు.

ఎక్కడో "పేపరు" అన్న కేకతో కళ్ళు తెరిచేరు శర్మగారు. పక్కింట్లో పేపరు విసిరిన కుర్రాడు శర్మగారు పిలుస్తున్నా వినిపించుకో కుండా సైకిలు వేగం హెచ్చించేడు. వాడు తమ వాడిక వాడుకాడు. ఈరోజు మా వాడికేం కాలం మూడిందో అనుకొన్నారు శర్మగారు మరోసారి.

పొద్దు అప్పటికి తిరుగకుండా ఇంకా శర్మగారి కళ్ళల్లోకి ఎండ పొడుచుకు వస్తూనే వున్నాది. కళ్ళకి చెయ్యి అడ్డంపెట్టుకుని మరోసారి-

వీధి చివరికి దృష్టి సారించేరు. దూరంగా కొడుకు, మనుమరాలు తిరిగి వస్తున్నట్లు కన్పించింది. ఆ ఎండవల్ల వారి ముఖాలు అతనికి తిన్నగా కన్పించలేదు. కొడుకు చేతిలోని పేపరుమాత్రం కన్పిస్తున్నాది. కొడుకు మరీ అంత మెల్లిగా నడిచివస్తున్నందుకు విసుక్కొన్నారు. అయినా తన కున్న ఆతృత వాడికేం తెలుస్తుందని సమాధానపడ్డాడు. పోనీ మనుమరా లయినా పరుగునవచ్చి "తాతయ్యా నీ పరీక్ష పాసయిందనీ చెప్ప కూడదూ?" అనుకున్నారు.

సాంబశివానికి అదే భయం కలిగి మల్లిక చెయ్యి గట్టిగా పట్టు కొన్నాడు. పేపరులో తండ్రి నెంబరులేదని చూసింది లగాయతు యీ వార్తని ఆయనకి ఎలా అందచెయ్యానా అని మధనపడుతున్నాడు అతడు. ఇది ఈనాడు ఉద్యోగావసరంకోసం చదివిన చదువైతే అంత బాధలేదు. కాని, ఆయన జీవితం పొడుక్కి పెంచుకొంటూ వస్తున్న కోరికామెను. ఈ వార్త విని ఆయన ఎంత బాధపడ్తారో? ఎంతగా దిగ జారి పోతారో? అనుకొన్నాడు సాంబశివం.

ఈ చెడువార్తని అతి నెమ్మదిగా, ఆయన హృదయం గాయపడ కుండా. సానుభూతితో అతనికి అందచెయ్యాలి అని నిశ్చయించు కొన్నాడు. కూతురు పదడుగుల దూరంనుండే "తాతయ్యా నీ పరీచ్చ పోయింది" అని కేకపెడ్తే? వున్నపళంగా ఆయన ప్రాణం విడిచినా ఆశ్చర్యం పడవలసింది వుండదు.

బజార్లో మల్లిక అడిగినప్పుడు "తాతయ్య పరీక్ష పోయిందమ్మా" అని తను చెప్పకపోవలసింది. కాని అప్పుడు ఇది ఒక సమస్యగా పరిణ మిస్తుందన్న అనుమానమే లేదు, ఇంక ఇప్పుడేది మార్గం?

అంతలోనే ఒక ఆలోచన మనసులోకి వచ్చింది.

"చూడమ్మా మల్లికా! బజారుకెళ్తుంటే తమ్ముడు పిప్పరిమెంట్లు

కావాలన్నాడు. మరచిపోయేను. ఈ రూపాయి తీసుకొని పక్కవీధిలోని రమణయ్య కొట్లో కొని పట్టుకు రాగలవా?" అన్నాడు తండ్రి చేతిలోని రూపాయి అందుకొని ఒక్క పరుగు తీసింది మల్లిక.

కొడుకుని చూడగానే శర్మగారి ముఖంలో ఒక వెలుగు వెలిగింది. ఆ వెలుగు క్షణకాలంపాటు సాంబశివం దృష్టిని చిమ్మచీకటి చేసింది. స్తిమితపడి చూసిన సాంబశివానికి తండ్రిముఖంలో భరించరానిబాధేదో అస్పష్టంగా అగుపించింది.

"ఈ వార్త కాయన తట్టుకోలేరు. ఈ వార్త అతనికి తెలియ—కూడదు" అని తనలో ఎవరో గొంతెత్తి అరచినట్లనిపించింది సాంబశివానికి

పోనీ! ప్రస్తుతానికి అబద్ధం చెప్పేస్తే? కాని అది లాభంలేదు. తన నంబరు పేపర్లో కళ్ళారా చూచుకోనిదీ ఆయన వూరుకోరు. పేపరు యింటికి తేవకపోవలసింది "కానిందికి పేపరు దొరకలేదు: ఫలితాలు నేను చూసేను మీరు పాసయ్యేరు" అని చెప్తే నమ్మి వుండేవారు. మరి ఇప్పుడెలా? తనచేతిలోని పేపరు అతని దృష్టిలో పడివుంటుంది. సాంబశివం ఆలోచనలు ఆగనేలేదు.

మరి నాలుగడుగులు నడిచేసరికి నడవావిడిలో ఆ రోజు - పేపరు పడి వున్నాది. శర్మగారు తన ఆలోచనలలో తానుండగా దానిని పేపరు కుర్రాడు పడేసిపోయేడు లాగుంది: దానిని అతను గమనించనేలేదు. అందుకు సాక్ష్యంగా అతనిముఖంలో ఆతృత నిల్చివుంది

సాంబశివం గుమ్మంలో కాలు పెడ్తుండగానే "సాంబూ." అన్నారు శర్మగారు ఆ కంఠం సాంబశివానికి ఏ సందేశం అందించిందో మరి మీ పరీక్షపాసయిందినాన్నా!" అని నమ్మకంగా అన్నాడు. అంతవరకు వున్న అనుమానాలేవీ, ఆమాట అతనిచే అనిపించిందికి అడ్డురాలేదు.

"ఆ....ఆ....పాసయిందా?" అంటూ కుర్చీలోకి చేరబడిపోయేరు శర్మగారు.

"నాన్నా!" అని పిలుస్తూ తండ్రిదగ్గరికి వెళ్ళేడు కొడుకు. డాక్టరు వచ్చిచూసి "అంతా అయిపోయింది అన్నాడు.

తండ్రిని దహనంచేసి తిరిగివస్తున్న సాంబశివానికి అంత దుఃఖంలోను తృప్తి మిగిలింది. తండ్రిప్రాణం తృప్తిగా పోయింది. తన జీవితంలో ఏది తీరని కోరిక అని బాధపడ్డారో దానివి సాధించేనన్న ఆనందంతో పోయింది. నేను ఆయనకి ఆ క్షణకాలం కల్గించిన ఆనందానికి ప్రతిఫలంగా నా అబద్ధాన్ని నాన్న మన్నిస్తారు; అనుకొన్నాడు సాంబశివం ఓదార్పుగా.

...(0)...